# నాటికి మరీచిక

## పి. గణపతిశాస్త్రి



'విమలా! విమలా! ఈ నెల్లో వచ్చిన జీతం అంతా ఏం చేశావు? ఎక్కడ దాచావు?'

గట్టిగా గొంతెత్తి గద్దించారు శ్రీవారు! ప్రతినెలా ఇదే వరస! జీతం వచ్చి రాగానే వస్తారు! తేతెమ్మని గుంజుకు పోతారు!

అయినా తమాయించుకున్నాను. ఇంకా అందలేదన్నాను: రేపుండి తప్పకుండా అందుతుందన్నాను.

నేనేదో దాచివేస్తున్నట్టు పసికట్టేసినట్టున్నారు. తటాలున వంటగదిలోకి వెళ్ళిపోయారు! బీరువా తలుపుతెరిచి, అట్టడుగు అరలో చీరమడతల మధ్యలో దాచుకున్న నా మనీపర్సు పట్టుకున్నారు! వెంటనే లోపలికివెళ్ళి వీల్లేదని అడ్డుకున్నాను. ఆయన చేతిలోనించి నా పర్సు లాక్కోబోయాను. చెంప ఛెళ్ళుమనిపించారు! అయినా నా పెనుగులాట మానలేదు. దభాలున వెనక్కి తోసేశారు! దప్పుగా నేలమీద కూలబడిపోయాను! కాలు బాగా బెణికింది. మరి లేవలేకపోయాను!

అంతలోనే ఆ పర్సుతో వరవరా వీధిలోకి వెళ్ళిపోయారు మావారు. అంతకు ముందే స్కూల్నించి వచ్చిన ఆడపిల్లలిద్దరు మా తగాదా బాగా గమనించి క్షణకాలం నిలువునా నిర్ఘాంతపడ్డారు! 'అమ్మని కొట్టొద్దు! కొట్టొద్దు! నాన్నా? నాన్నా!' అంటూ రాగాలు మొదలుపెట్టారు. పక్కనే ఆడుకుంటున్న పసివాడూ మరింతగా బెంబేలుపడి, గుక్కతిప్పుకోకుండా ఏడుపు మొదలుపెట్టాడు! మా ఆయన వీధిలోకి వెళ్ళిపోయాక ఆడపిల్లలిద్దరు నన్ను వాటేసుకుని కుమిలి కుమిలి దుఃఖించారు. అందరిని అతికష్టంమీద సముదాయించగలిగాను. పెద్దది పదేళ్ళ పిల్ల, రెండోదానికింకా ఏడేళ్ళు నిండలేదు, పసివాడికి ఇటీవలే మూడేళ్ళు నిండాయి.

అంతలోనే పెద్దగాలి వీచి, అదేపనిగా వర్షం పట్టుకుంది. లైట్లన్నీ హఠాత్తుగా ఆరిపోయాయి! కాస్త గాలి, వాన వస్తే ఇలాగ లైట్లారిపోవడం మా ఇంట్లో ఎప్పుడూ అలవాటే! మళ్ళీ కాస్త వెలుగన్నది ఎప్పటికి కళ్ళబడుతుందో మరి!

మేము ముగ్గురం అక్కచెల్లెళ్ళము. అన్నదమ్ములెవ్వరు లేరు! నా అయిదో ఏట మా అమ్మ చనిపోయింది. నాన్న రైల్వేలో స్టేషన్‌మాస్టరు. అక్కయ్యిద్దరికీ ఆయన చదువుసంధ్య అంతగా చెప్పించలేదుగాని, లక్షణంగా పెళ్ళిళ్ళుచేసి, అత్తవారిళ్ళకి పంపించేశారు.

ఇక నాదగ్గిరికి వచ్చేసరికి, ఆయనకి, నాకు అన్నివిధాలా వచ్చిన సంబంధమేది కుదరలేదు. ఒక సంబంధం కొంచెం మంచిదే వచ్చిందిగాని కట్నకాను

కల దగ్గిరే బొత్తిగా సాగలేకపోయాను. అనవసరంగా మధ్యలో మానిపించడ మెందుకనుకుని, నా చదువు అలాగే కొనసాగించారు నాన్న.

నేను ఇంగ్లీషు లిటరేచర్‌తో ఎమ్మే ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. ఆలోగా నా పెళ్లికోసం ప్రయత్నాలెన్నో చేశారు నాన్న. ఒక్కటి కలిసి రాలేదు. అయినా ఆయన అధైర్యపడలేదు. పోనీ అనుకుని నా ఉద్యోగంకోసం ప్రయత్నాలారంభించారు. కాళ్లకి బలపాలు కట్టుకుని తిరిగాక, చిట్టచివరికి ఒక మంచి ఉద్యోగమే దొరికింది. మదరాసులో ఒక విమెన్స్ కాలేజీలో లెక్చరర్‌గా కుదురుకున్నాను. హాస్టల్లో జేరిపోయి హాయిగా నా ఉద్యోగం కొనసాగించాను. కాలేజీలో చదువుకుంటున్నప్పుడే కథలు అల్లడం మొదలుపెట్టాను. ఏడెనిమిది కథలు నావి అప్పుడప్పుడు పత్రికల్లో ప్రచురించారు. ఒకదానికి మంచి బహుమతి కూడా వచ్చింది. మళ్లీ ఆ ధోరణిలో పడాలనుకున్నాను. కాని స్తిమితం చిక్కలేదు.

ఆ పైన కాకినాడలో ఉంటున్న నాన్నగారు ఒంటరివారయ్యారు. ఎవరో ఒక ముసలావిడ వంటమనిషిగా కుదిరి, విస్తట్లో నాలుగుమెతుకులు వడ్డిస్తే మాత్రం ఒరిగేదేమిటి? ఎంతకాలానికి నాకు పెళ్లి కాలేదన్న దిగులువల్లనయితేనేమి, పెద్దతనంలో తోడతెగిన ఒంటరితనంవల్లనయితేనేమి నాన్న ఆరోగ్యం నానాటికీ పూర్తిగా పాడయింది. పెద్దక్కయ్య కొన్నాళ్లపాటు ఆయనదగ్గిరే ఉండి శాయశక్తులా పరిచర్య చేసింది. కాని చిట్టచివరికి అకస్మాత్తుగా ఆవిడ చేతుల్లోనే వెళ్లిపోయారాయన. నాన్ననొక్కసారి కళ్లారా చూసుకునే అదృష్టం కూడా పట్టలేదు నాకు!

అప్పటినించి, నాకింక పెళ్లికాదనుకుని పూర్తిగా నిరాశ చేసుకున్నాను. అయితే అంతులేని ఒంటరితనము. దిగులు భరించలేక 'వరుడు కావలెను!' అని పత్రికల్లో ఆయా సంపాదకుల చిరునామాలతో అయిదారు ప్రకటనలు వేయించాను. ఇంకా నా వివరాలు కొన్ని కావాలంటూ ఏడెనిమిది ఉత్తరాలదాకా వచ్చాయి. వెంటనే అన్నింటికీ తగిన సమాధానాలు వివరాలూ పంపించాను. కాని ఒక్కరు నన్ను చూడడానికి రాలేదు! ప్రాణం విసిగి మళ్లీ ఇంకొక ప్రకటన వేయించాను. తిరిగి ఇంకొకటి వేయించాను! ఈ సారి చిన్న సూట్‌కేస్ చేత్తో పట్టుకుని. నన్ను చూడడానికి తిన్నగా హాస్టల్‌కే వచ్చారు మావారు. ఆయనది కండలు తిరిగిన గట్టి శరీరం! రంగు రవంత ఎరుపు. నుదురు కొంచెం పెద్దదే. దానిమీద నల్లని క్రాప్ జీరాడుతూంటుంది, బంగారు ఫ్రేమ్ కళ్లద్దాలు. కళ్లు కొంచెం చిన్నవే కాని చురుకుచూపులు చేతికి రోల్డ్‌గోల్డ్ రిస్టువాచీ. నోటిలో సిగరెట్. బి.ఏ., బి.ఇడి. డిగ్రీలతో పెద్దాపురంలో మునిసిపల్ హైస్కూల్లో ఫస్ట్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నెలకి సుమారు మూడు వందలదాకా చేతికందుతాయి.

ఆయన మాట్లాడ్డం మొదలుపెడితే అలా వింటూ కూర్చోవలసిందే! అంతటి మాటకారి మావారు! మొట్టమొదటి చిరునవ్వుతోనే నన్నిట్టే ఆకట్టుకున్నారాయన. పేరు సోమసుందరం. దానికి తగిన అందచందాలంతగా లేకపోయినా, అనాకారి మాత్రం కాదు. పైగా ఏదో వింత ఆకర్షణ కొట్టవచ్చినట్టు స్ఫురిస్తుంది.

మావారికిది రెండో పెళ్లి. మొదటి భార్యపోయి, ఇంచుమించుగా మూడేళ్లయింది. ఇంక పిల్లలెవ్వరూ లేరు. వేరే బాదరాబందీ కూడా ఏదీ లేదు. ఆయన వయస్సు నలభైలోపు. కాని ఇంకా అంతకన్న చాలా చిన్నవారిలాగే కనిపించారు.

అయినా నేను కొంచెం తటపటాయించాను, పది పదిహేను రోజులలోగానే నా నిర్ణయం తెలియజేస్తానన్నాను! సరే, అని చక్కని చిరునవ్వుతో తిరిగి పెద్దాపురం వెళ్లిపోయారు. ఆ తరవాత ఆయన దగ్గిరనించి రెండేసి రోజుల కొకసారి బరువయిన కవరు ఎగిరివచ్చేది! కాని దేనికీ నేను సమాధానం వ్రాయలేదు.

అయితే ఆయన మాటల్లో గాని, ఉత్తరాల్లో గాని అనుమానించడానికి ఎక్కడా ఆస్కారం కనిపించలేదు! మంచి నిజాయితీ ఉన్న తగు మనిషిలా కనిపించారు. నాది చామనచాయే అయినా, చక్కని కనుముక్కు తీరున్న ముఖమని ఉత్తరాల్లో మాటిమాటికీ నా అందచందాలన్నీ ఆకాశానికి ఎత్తివేశారు! ఆ పైన అద్దంలో అదేపనిగా నా ముఖం చూసుకున్నాను. అదికూడా ఆయన పొగడ్త అక్షరాలా నిజమే అని స్పష్టంగా సాక్ష్యం చెప్పింది! అదీగాక నా కప్పుడే పాతికేళ్లు పైబడ్డాయి! తీరా గుమ్మంలోకి వచ్చిన సంబంధం కాదనుకుంటే, మరి పెళ్లే కాదేమో అని విపరీతమయిన మథన పట్టుకుని వేధించింది.

సరిగా పదిహేను రోజులు దాటగానే మళ్లీ మద్రాసులో వాలిపోయారు మావారు. ఆయన మాటలన్నీ విన్నతరువాత నేనింక ఆలోచించలేదు. వెంటనే అంగీకారం వ్యక్తీకరించాను. ఇద్దరము ఏకీభవించి, ముమ్ముందుగా మద్రాసులో రిజిస్టర్ వివాహం చేసుకున్నాము. ఆ పైన ఆ ఏడుకొండలవాడి సమక్షంలోకూడా మా పెళ్లి సలక్షణంగా జరిగిపోయింది.

వివాహం కాగానే రాయపేటలో హంగులన్నీ ఉన్న ఒక మంచియిల్లు కుదిర్చి దానిలో ప్రవేశించమని బలవంత పెట్టారు మావారు. మొట్టమొదటగా మూడువందల ఏడ్వాన్సు ఆయనే ఇచ్చారు. అన్నింటితోను కలుపుకుని అద్దె నూరురూపాయలే! చిన్నదయినా చక్కని ఇల్లు! ఆనాటితో నా హాస్టల్ జీవితానికి స్వస్తిచెప్పి ఆ మరునాడే అక్కడ అడుగుపెట్టాను! పెద్దాపురంలో తమ మేష్టారి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, మద్రాసులో అలాంటి ఉద్యోగమే ఇంకొకటి చూసుకుని, ఇక్కడే స్థిరపడిపోవాలని ఆయన కూడా ఎంతో ఉబలాటపడ్డారు. దానికోసం ప్రయత్నంకూడా ప్రారంభించారు. ఇక్కడికి వచ్చినప్పుడల్లా ఏదో ఒక బహుమతి చేతికందించేవారు. అప్పుడప్పుడు మంచి సొగసయిన పెద్దాపురం సిల్కుచీరకూడా పట్టుకువచ్చేవారు! ఇద్దరము కలిసి షికార్లకి, సినిమాలకి బయలుదేరేవాళ్లము. ఆరోజులన్నీ ఎంతహాయిగా గడిచిపోయాయి! అలాంటి మంచికాలం మరి తిరిగి రాదు గదా!

అయితే సాహిత్యంలో ఆయనకంతగా మంచి అభిరుచి లేదు. అసలే లెఖ్ఖల మేష్టారు! ఆ పైన చవకబారు డిటెక్టివ్ నవలలే ఎక్కువగా చదువుతూంటారు. ఒకసారి నేను అప్పుడే పూర్తిచేసిన నా కథ వినిపించడం మొదలుపెట్టాను. మాటిమాటికీ ఆవలిస్తూ చిటికెలు వెయ్యడం ప్రారంభించారు. ఎలాగో అలాగ ఆ కథ చిట్టచివరిదాకా నెట్టివేశాను. ఆయన విని

వినవట్టు మాట్లాడ కూరుకున్నారు. అంతే! ఆ తరవాత దానికే మంచిబహుమతీ వచ్చింది! అయినా నేనేమాత్రము చిన్నబుచ్చుకోలేదు. పోనీ లెమ్మనుకుని సరి పెట్టుకున్నాను. అయితే ఆ పైన ఆయన కెప్పుడు నాకథ చదివి వినిపించలేదు !

ఆ తరవాత క్రమక్రమంగా నాకు ఇద్దరాడ పిల్లలు కలిగారు ఈలోగా ఎంతగా ప్రయత్నించినా నేను మా ఆయన్ని మద్రాసు రప్పించలేకపోయాను. ఎంత సేపు నా పోరేగాని అసలు ఆయనికి ఇక్కడికి వచ్చి స్థిరపడాలన్న ధ్యాసే కలగలేదు ! చిట్ట చివరికి మద్రాసులో ఆయనకొక మంచి ఉద్యోగంకూడా సంపాదించ గలిగాను. కాని మావారు ఒప్పుకోలేదు ! పెద్దాపురం హైస్కూల్లో తమ సర్వీస్ అంతా మంటగలిసి పోతుందని విసుక్కున్నారు

పోనీ నేనే నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, పెద్దాపురం వచ్చి వేస్తానన్నాను. మావారికిది బొత్తిగా నచ్చలేదు! నెల తిరిగేసరికి నిక్షేపంలా అయిదువంద లందిస్తున్న ఉద్యోగం వదులుకోవడం వట్టి తెలివితక్కువ పని అని గట్టిగా కసురుకున్నారు! ఇక్కడికి ఆయన రారని తేలిపోయింది! ఆ పైన నేనక్కడికి వెళ్ళడానికి కూడా వీల్లేదన్నమాట! ఇదీ మా సంసార పరిస్థితి !

ఇటీవలే అయిదునెలలకిందట నాకు పనసపండంటి మగపిల్లవాడు కలిగాడు. ఆ పైన వేసంకాలం సెలవులు కూడా వచ్చాయి. నేనింక ఒక్క క్షణమయినా మద్రాసులో ఉండలేక పోయాను ! అయితే ఎందుచేతనోగాని, నేను పెద్దాపురం రావడం బొత్తిగా రుచించలేదు మావారికి ! అక్కడ ఎండలు మండిపోతున్నాయన్నారు. అదీగాక 'అక్కడే ముంది మన్ను!' అని చప్పరించేశారు ! ఆ పైన అక్కడ తమరు ఉంటున్న గది చాలా చిన్నదని ఇంకొక్క అడ్డుపుల్ల వేశారు. ఆయన అలాగంటున్నకొద్దీ, ఒక్కసారి అక్కడికి వెళ్ళితీరాలని నాలో గట్టిపట్టుదల బయలుదేరింది. కాని ఆయన కాదు, కూడదన్నప్పుడు బయలుదేరడం ఎందుకులే అనుకుని అప్పటికి నా ప్రయాణం వాయిదా వేసుకున్నాను.

# ఏటి కెదురీత

ఆ పైనే అసలు కథ అంతా మొదలయింది. ఇదిగో, అదిగో అంటూ రెండు నెలలదాకా అసలాయన మద్రాసే రాలేదు ! పైగా రెండు వందలు, మూడు వందలు పంపించవలిసిందని టెలిగ్రాముల మీద టెలిగ్రాములు! కాని నేనంత సొమ్ము పంపించలేకపోయాను ! వచ్చే అయిదువందల తోనే ఇక్కడ నా సంసారం అంతా చక్క బెట్టుకోవాలిగదా ! అంత సొమ్ము ఒక్కసారిగా కక్కమంటే ఎక్కణ్ణించి తేగలను? అయినా అప్పుడప్పుడు కొంత పంపించాను. అంతే ! ఆయనధోరణి నాకేమి అంతుపట్ట లేదు !

ఆ తరవాత పిల్లల్ని అందరిని తీసుకుని నేనే పెద్దాపురం బయలుదేరాను. వస్తున్నానని ముందుగానే ఉత్తరం వ్రాశాను. కాని చామర్లకోట స్టేషన్‌లో ఆయన జాడే ఎక్కడ కనిపించలేదు ! ప్రత్యేకంగా ఒక గుర్రపుబండి కట్టించుకుని, నేనే పెద్దాపురం చేరుకున్నాను. అతికష్టంమీద ఆయన ఉంటున్న ఇల్లు పట్టుకోగలిగాను. అది చిన్నగది కానే కాదు ! అన్నింటికి ఇమ్ముగా ఉన్న ఒక మంచి ఇల్లే !

ఆ పైన ఆ ఇంట్లో పాతికఏళ్ళయినా నిండని పసినిమ్మ పండులాంటి వంటావిణ్ణి చూడగానే నాలో అనుమానం బలపడింది. మొత్తంమీద ఆవిడ అందగత్తెకిందే లెక్క ! ఆ వగలు, ఒయ్యారాలు చూస్తూంటే అసలావిడ వంటమనిషిలాగే కనబడలేదు ! ఆ పైన ఆ ఇంట్లో ఇంకొకగదిలో ఆవంటావిడ తల్లికూడా కనిపించింది ! ఆవిడే ఆ ఇంటికంతటికి యజమానురాలిన్నట్లు హంగామా చేస్తూంది ! ఎంతటి విడ్డూరం!

అంతలోనే మా ఆయన హైస్కూలు నించి ఇంటికి తిరిగివచ్చారు. నన్ను చూస్తూనే నిలువునా నిర్ఘాంతపడినట్టు నటించారు ! నేను వ్రాసిన ఉత్తరం తమకందనే లేదన్నారు! 'ప్రయాణంలో ఇబ్బందులేవి పడలేదుగదా!' అని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. అంతలోనే కాఫీ కప్పులతో, ఫలహారాలతో ఆ వంటావిడే అక్కడికి వచ్చింది.

అక్కయ్యగారూ, ప్రయాణంలో పసిపిల్లలు, మీరు ఎంతో అలిసిపోయినట్టున్నారు ! ముందు కాస్త కాఫీలుతీసుకోండి!' అంటూ బలవంత పెట్టింది. అంతలోనే ఆవిడతల్లి పైటతో ఒళ్లంతా కప్పుగుని 'తీసుకో అమ్మా ! ఎంతో హైరాణపడ్డట్టున్నావు!' అంటూ సన్నగా సన్నాయినొక్కులు నొక్కడం మొదలు పెట్టింది.

లోపల అట్టుడికినట్టు ఉడికిపోతున్నాను ! అయినా తొందర పడలేదు ! పిల్లలు, నేను కాఫీ ఫలహారాలన్నీ తీసుకున్నాక, మా వారిని వేరొక గదిలోకి పిలిచి, అడగవలసిన వన్నీ నిర్మొహమాటంగా మొహంమీదే అడిగేశాను! ఎంతో ఆశ్చర్యపడ్డారాయన! ఏ పాపము ఎరగనన్నారు ! ఆ వంటావిడ, ఆమె తల్లి చాలా మర్యాదస్థులన్నారు. హోటల్ మెతుకులు పడక ఇటీవలే ఆ ఇల్లు తీసుకుని, ఇంటిల్లపాది పనికి, వంటకి ఆ ఇద్దరిని కుదుర్చుకున్నట్టు నవ్వుతూనే సమాధానం చెప్పారు. ఆయనకంత సొమ్మెందుకు కావలసి వచ్చిందో అప్పటికి నాకు పూర్తిగా బోధపడింది ! కాని ఆయన మాటలన్ని విన్నతరవాత నేనేమన్నా పొరబడుతున్నానా అనిపించింది! అయితే ఆ సంగతి ఇన్నాళ్ళనించి, నా దగ్గర దాచిపెట్టవలసినంత అవసరం ఏమి వచ్చింది? మళ్ళీ నాలో గట్టి అనుమానం మొలకెత్తింది.

ఆవేళ, ఆ మరునాడు అక్కడే ఉండిపోయి, పనిమనిషిని పరస్పరంగా పిలిచి ఆరాలన్నీ తీశాను. నా అమాయికత్వం గమనించి అది కొంచెం నవ్వుకుంది. ఆ ఆయనికి, ఆ వంటావిడకి జోస్తీ కలిసి అప్పుడే ఆయిదారు నెలలయిందిట! ఇటీవల రెండునెలల నించి బాహాటంగానే సంసారం సాగిస్తున్నారట! ఊళ్లో అందరికి తెలిసిన ఆ సంగతి నాకెందుకు తెలియలేదని ఆ పనిమనిషి మరింతగా విస్తుపోయింది. అప్పటికయినా పూర్తిగా కనువిప్పు కలిగించినందుకు దానికొక చీర బహూకరించాను!

ఇంక అక్కడ ఒక్కక్షణం కూడా ఉండలేకపోయాను. వెళ్ళిపోవద్దని బలవంత పెట్టారు మావారు. ఆ ఆయన మాట లేవి వినదలుచుకోలేదు! వెంటనే పిల్లలందరితోను కలిసి మరునాటికి మద్రాసు వచ్చేశాను. అంతే! అప్పటినించి నా యాతనలన్ని ప్రారంభమయ్యాయి.

సరీగా జీతం అందుకునే సమయానికి మద్రాసులో దిగుతారాయన. పిల్లలు, నేను

తిన్నా, వున్నా మావారికేమి పట్టదు! ఇటీవల ఒక్కమారయినా పసివాణ్ణి ఎత్తుకొని ముద్దు పెట్టలేదు! వట్టి చేతులతోనే వస్తారు. నిండుచేతులతో తిరిగి వెళ్ళిపోతారు! నయానా భయానా నచ్చజెప్పినా చేతిలో ఉన్న సొమ్మంతా ఒకేసారి గుంజాకుపోతారు! మా సంసారానికేమి మిగల్చరు! ఇవ్వనంటే ఈ మధ్యన గొడ్డుని బాదినట్టు కొట్టడం కూడా మొదలుపెట్టారు! నానాటికీ నా నవనాళ్ళు కుంగిపోతున్నాయి. ఇరుగు పొరుగులందరికీ నా పరిస్థితులన్నీ తెలిశాయి. అయినా ఒక్కరు ఇదేమని అడ్డుకోరు! భార్యాభర్తల తగాదాల్లో ఎవరు కలగజేసుకుంటారు? ఇటీవల ఈ గొడవలన్నీ మా కాలేజీదాకా కూడా పాకిపోయాయి! అప్పటినించి నలుగురిలోను తల ఎత్తుకుని తిరగలేకపోతున్నాను! నేనిప్పుడు మా ఆయన దృష్టిలో సొమ్ము సంపాదించి పెట్టే వట్టి యంత్రమనిషిని! అంతే! ఇంతటి భయంకరమయిన కారాగారంలో ఇరుక్కున్న దానికి నేనేమి చేశాను?

అందరిలాగే పెళ్ళిచేసుకుని, హాయిగా సుఖపడాలని కలలు కన్నాను! అంతే! భార్యాభర్తలన్న తరవాత, ఎప్పుడన్నా ఎడ మొహాలు, పెడమొహాలు పెట్టుకోవచ్చును! అంతేగాని ఏనాడన్నా ఒళ్ళు హూనమయ్యేటట్టు బాదగొట్టి చిత్రహింస చేస్తారా? ఇటువంటి కిరాతకం మనిషి ఉన్నారంటే ఎవ్వరు నమ్మలేరనుకుంటాను! ఇదంతా వట్టి అభూతకల్పన కింద కొట్టిపారేస్తారనుకుంటాను! కనకనే కల్పనలతో నిండిన నవలలన్నింటికన్న జీవితమే ఎంతో విడ్డూరమయిందన్న మాట పుట్టిందనుకుంటాను! ఎందుకిలాగ నన్ను హింసిస్తున్నారు మా వారు? నోరు, వాయి లేని అమాయికుల్ని కొట్టుకు తింటూంటే కొందరి కెంతో సంతోషం కలుగుతుందనుకుంటాను! అంతే! అదీగాక నేనీ చెరసాలలోనించి తప్పించుకుని బయటపడలేనన్న గట్టి ధీమా కూడా కలిగి ఉంటుందనుకుంటాను!

ఈ యమయాతనలింక భరించలేక, ప్రాణం విసిగ చిన్నక్కకి, పెద్దక్కకి వేరువేరుగా రెండు పెద్ద ఉత్తరాలు పంపించాను. చిన్నక్క వెంటనే విడాకులు తీసుకోవలసిందని ప్రోత్సహించింది. లేకపోతే ప్రాణాపాయమే కలగవచ్చునని భయపెట్టింది, కాని పెద్దక్కయ్య మాత్రం తొందరపడవద్దని సలహా ఇచ్చింది. కొంత ఓపికపట్టి కాపరం తిరిగి సరిదిద్దుకోవలసిందని నచ్చజెప్పింది. ఓరిమి వహించక నేనింక చెయ్యగలిగిందేమిటి? ఈ పరిస్థితిలో విడాకులు తీసుకోవడమంటే మాటలా? పిల్లలందరు తండ్రిలేని అనాథలయిపోరూ? విడాకులే కనక తీసుకుంటే నా జీవితానికింక భవిష్యత్తేమిటి? గౌరవమేమిటి? నలుగురు నాకేసి వేలెత్తి చూపించరూ?

# ప్రాచీన వైద్య పద్ధతులు

## తేలు విషాన్ని హరించేవి

(1) ఒంటె లద్దె కాల్చగా మిగిలిన బూడిదను లేదా సవా సాగరమును తడిసున్నంతో బాగా కలిపి— తేలుకుట్టిన చోట, కొంత ముద్దను అంటించి— కొంత ముద్దను వాసన చూపించినట్లయితే తేలు విషం విరిగి, మంట, బాధ శీఘ్రంగా తగ్గుతాయి.

(2) ఆకాశ గరుడ దుంప యొక్క గంధాన్ని తీసి—తేలుకుట్టిన చోట దట్టంగా పూసి, నిప్పు సెగతో కొంతసేపు కాచినట్లయితే విషం హరించ బడుతుంది.

3) ఉత్తరేణి ఆకులనుగాని, దాని పూత వెన్నులనుగాని, మెత్తగా నూరి, తేలుకుట్టిన చోట, దళసరిగా పట్టించినచో త్వరలోనే బాధ, మంట తగ్గుతాయి.

(4) పెద్ద నీరుల్లి పాయను రెండు ముక్కలుగా కోసి—ఒక ముక్కపై సున్నపు పొడిచల్లి, దానితో తేలు కుట్టిన చోట కొంత సేపు రుద్దిన—బాధ మంట, తగ్గుతాయి.

(5) గచ్చ కాయలోని పప్పుతో గంధం తీసి—తేలు కుట్టిన చోట, అంటించి— నిప్పు సెగతో కాచిన విషం హరించ బడుతుంది.

6) జీల కఱ్ఱ, తేనె, ఉప్పు, నెయ్యి, కలిపి నూరి తేలు కుట్టిన చోట ఆ ముద్ద పెట్టి, కట్టు కట్టినట్లయితే తేలువిషం హరించ బడుతుంది.

(7) తేలుమణి చెట్టు ఆకుల్ని నూరి ఆముద్దను ఆముదంలో ఉడికించి—దానితో తేలు కుట్టిన చోట, కొంత సేపు రుద్దినచో తేలు విషం హరించ బడుతుంది.

(8) శుద్ధి చేసిన నాభిని స్పిరిటుతో అరగదీసి—తేలుకుట్టిన చోట కొంతసేపు రుద్దినచో విషం హరించ బడుతుంది.

(9) ఒక అవున్న నీరుల్లి పాయల, రసాన్ని త్రాగించి నీరుల్లి పాయల ముద్దను గుడ్డలోపెట్టి వాసన చూపించి కొంత ముద్దను తేలు కుట్టిన చోట పెట్టి కట్టు కడితే తేలు విషం హరించ బడుతుంది. ఒంటిరేక వెల్లుల్లి పాయను రెండుముక్కలుగా కోసి, ఒక ముక్కను తేలుకుట్టిన చోట అంటించిన అది విషాన్ని పీల్చివేస్తుంది. విషాన్ని పీల్చడానికిది [illegible] పని చేస్తుంది.

(10) మదనానబ పాలును తేలుకుట్టిన చోట మర్దన చేసినచో—తేలు విషం హరించ బడుతుంది.

## జెర్రి, పురికొన మొదలగువాని విషాన్ని హరించేవి

(1) అవిసె ఆకురసం జెర్రి లేదా పురికొన కుట్టినదగ్గర దట్టంగా పట్టించినచో ఆ విషం హరించబడుతుంది. ఆకు రసం లోనికి కూడా యివ్వవచ్చును మోతాదు మూడు తులములు ఎత్తు.

(2) పొత్తిదుంప గంధాన్ని జెర్రి పురికొన, మొదలగునవి కుట్టిన చోట దట్టంగా పూసి, నిప్పుసెగతో కొంత సేపు కాచినచో నొప్పి, మంటా తగ్గుతాయి.

(3) కుంకుడు కాయను నీళ్ళతో అరగదీసి, ఆ గంధాన్ని, జెర్రి, పురికొన మొదలగునవి కుట్టిన చోట దట్టంగా పట్టువేసి, నిప్పు సెగతో కాచిన విషం విరుగుతుంది.

(4) కుప్పింటి ఆకు మెత్తగా నూరి— జెర్రి, పురికొన, మొదలగు విషపు పురుగులు కుట్టిన చోట, దట్టంగా పట్టువేసి కాచిన విషం విరుగుతుంది బాధవేగంగా తగ్గుతుంది.

(5) ఉత్తరేణి ఆకులు గాని, పూత వెన్నులుగాని, మెత్తగా నూరి—జెర్రి, పురికొన మొదలగు విషపు పురుగులు కుట్టిన చోట దట్టంగా పట్టు వేసినచో శీఘ్రంగా మంట తగ్గుతుంది.

సేకరణ : ఆకుండి నారాయణమూర్తి

# పాండవస్తవ ప్రయోజనాలు



బులుసు వెంకటరమణయ్య — ధర్మపథం

చెడ్డవాళ్లను స్మరించడంవల్ల చెడుపు కలుగుతుందనీ, మంచివారిని స్మరించినట్లయితే మేలు కలుగుతుందనీ మనవారి నమ్మకం. ఇందువల్లనే ప్రాచీన సంప్రదాయానికి చెందినవారు ఉత్తములను స్మరిస్తూ, చెడ్డవారి ఊసే తలపెట్టకుండా ఉంటారు.

మన ఇతిహాస, పురాణాలలో ఉత్తములయొక్కయు, సామాన్యులయొక్కయు, అధములయొక్కయు వృత్తాంతాలు కొనవస్తున్నవి. రామాయణంలో రామ, సుగ్రీవ, విభీషణాదులు ఉత్తములు. రావణాదులున్నగువారు అధములు. భారతంలో పాండవులు ఉత్తములు; దుర్యోధనాదులు అధములు. వీరిలో ఉత్తములను కీర్తించడంవల్ల సుఖాలు కలుగుతాయని విశ్వాసం.

పాండవు లయిదుగురూ ఒక్కొక్క విషయంలోనూ ప్రసిద్ధి సంపాదించారు. వారిని స్తుతించడంవల్ల కలిగే మేళ్లు ఈ శ్లోకం వివరిస్తున్నది.

'ధర్మో వివర్ధతి యుధిష్ఠిర కీర్తనేన
పాపం ప్రణాశ్యతి వృకోదరకీర్తనేన,
శత్రుర్వినశ్యతి ధనంజయకీర్తనేన,
మాద్రీసుతౌ కథయతాం న భవంతి
రోగాః.'

పాండవులలో పెద్దవాడైన యుధిష్ఠిరుడిని కీర్తిస్తే ధర్మం వృద్ధి పొందుతుంది — అంటే ధర్మంగా ప్రవర్తించాలనే ఆసక్తి ఎక్కువగా కలుగుతుంది. భీమసేనుణ్ణి స్తుతిస్తే పాపం నశిస్తుంది— అనగా పాపకార్యాలమీద బుద్ధి ప్రసరించదు. అర్జునుడిని కీర్తిస్తే శత్రుభయం నశిస్తుంది. నకుల, సహదేవులను స్తుతిస్తే రోగా లేవీ సమీపించవు

ధర్మబుద్ధి యుధిష్ఠిరుని మూలంగా కలగడానికి కారణం ఆయన ధర్మంగా ప్రవర్తించడంవల్లనే. న్యాయానికి కట్టుబడి ఆయన ఉండకపోతే అతని సోదరులు కౌరవులను ఏనాడో హతమార్చి ఉందురు. యుద్ధానికి అవసరమే లేకపోయేది పాపబుద్ధి కల మహా బలవంతుడు కీచకుడు సులభంగా భీముడిచేత చంపబడినాడు అతని పేరు తలచుకొంటేనే బెగడు కలుగుతుంది. పాపంమీద బుద్ధి పోదు.

అర్జునుడికి సాటి వీరుడు లేడు. అతని స్మరణంవల్ల శత్రువులు సులభంగానే లొంగిపోగలరు అందువల్ల శత్రుభయం ఉండదు.

నకులసహదేవులు అశ్వినీదేవతల పుత్రులు. ఆ దేవతలు దేవవైద్యులు. అందువల్ల నకులసహదేవులున్నూ వైద్యశాస్త్రంలో నిపుణులు వారిని స్మరించడంవల్ల రోగాలు నశించి, జనులు ఆరోగ్యవంతులుగా ఉండడం అసంభవం కాదు ●

# ఏటి కెదురీత

ఇంకా లైట్లు వెలగలేదు! చూట్టూరా చేరుకున్న గాఢాంధకారం భరించలేకపోయాను! అతికష్టంమీద అగ్గిపెట్టె వెతికి పట్టుకుని కొవ్వొత్తులు రెండు వెలిగించాను. మరి కొంతసేపటికి మావారు తిరిగి వచ్చారు చిత్తుగా తాగివచ్చినట్టున్నారు! కళ్లు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి! క్షణకాలం నాకేసి పరీక్షగా చూశారు! ఆయన చిటికెనవేలిమీద కొత్త ఉంగరం మెరుస్తూంది! అది ఆ వంటావిడ కందించే బహుమతి కాబోలు!

'పర్సులో నాలుగువందలే ఉన్నాయేం? మిగిలిన సొమ్మంతా ఎక్కడ దాచిపెట్టావు? చెప్పవేం ?'

గొంతెత్తి గర్జించారు!

నాలో విపరీతమయిన భయం బయలుదేరింది! ఎంతగా ప్రయత్నించినా నోట మాట పెగలలేదు !

'ఏం? మాట్లాడవేం ?' అంటూ నా సిగ దొరకబుచ్చుకుని అదేపనిగా గుంజడం మొదలుపెట్టారు! మళ్లీ పిల్లల ఏడుపులు ప్రారంభమయ్యాయి ! కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ చేతులు రెండు జోడించి 'ఇన్ని లాగ వేధించుకు తినకపోతే, ఒక్కసారిగా గొంతునులిమి చంపెయ్యకూడదూ?' అని బ్రతిమాలుకున్నాను. అయినా ఆయన మనస్సు కరగలేదు! మరింత గట్టిగా గుంజి నా తల గోడకేసి కొట్టారు! నా కళ్లు చీకట్లు కమ్మాయి. స్పృహ తప్పిపోతున్నట్టనిపించింది. క్షణకాలం కాళ్లు గట్టిగా నిలదొక్కుకున్నాను. అంతే!

అంతలోనే ఒక్కసారిగా కొండంతబలం వచ్చింది! నా యావశ్శక్తి వినియోగించి రెండుచేతులతోను ఆ పశువుమనిషిని ఒక్కసారిగా వీధిలోకి తోసివేశాను! గడియపెట్టి తలుపులు రెండు గట్టిగా బిడాయించాను. ఆ తలుపులమీద ఆనుకొని నిలుచున్నాను!

ఇన్నాళ్ళనించి ఎంతో ఓరిమి వహించి భరించాను ఇంక ఏటికి ఎదురీదడానికి ఇదే మొదలు! నేనింక భరించదలుచుకో లేదు !

తలుపులమీద దబదబా బాదడం మొదలుపెట్టాడా తాగుబోతు మనిషి! నేనేమాత్రము చలించలేదు !

'ఇదిగో, ఈ క్షణంనించి, నీకు, నాకు సరి! గొడవచేశావా, పోలీసులచేత గెంటించి అరెస్టు చేయిస్తాను! ఇంక ఎన్నడు ఈ వీధికేసి తొంగిమాడకు ! ఎక్కడికి పోతావో పో!'

ఒళ్లెరగని ఆవేశంతో కొమ్ములొచ్చినట్టు బలంతో గొంతెత్తి గర్జించాను! అలాగే తలుపులమీద ఆనుకుని నిలుచున్నాను. ఆపైన మళ్లీ తలుపుతట్టిన ధ్వని వినిపించలేదు! తరవాత లైట్లన్నీ గప్పున వెలిగాయి! పిల్లలనందరిని గుండెకద్దుకుని సముదాయించాను. వాన క్రమక్రమంగా వెలిసింది

హాయిగా ఊపిరి పీల్చుకున్నాను! ●